ప్రజా విశ్వంభర

ఏఐతో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వినియోగించి తెలంగాణలో పౌర సేవలను మరింత సమర్థవంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక ఆధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన 'ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ బిల్డింగ్ కాంపిటీటివ్ నెస్' అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సీఎం ప్రసంగించారు. రైతు భరోసా వంటి సబ్సిడీల ట్రాకింగ్ నుంచి మొదలుకుని ఆస్తి పన్ను వసూళ్లు, మహిళలకు అందించే సంక్షేమ పథకాల అమలు, పట్టణ మున్సిపల్ సమస్యల పరిష్కారం వరకు అనేక రంగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. వ్యవస్థలోని మేధస్సే ఒకవైపు సమస్యగా, మరోవైపు పరిష్కారంగా మారుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏఐని సరైన దిశలో వినియోగిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు. అధునాతన ఏఐ యుగంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉండలేవని,



ముందస్తు చర్యలు తీసుకోవడం, వేగంగా నిర్ణయాలు అమలు చేయడమే కీలకమని ఏఐ ప్రభావం గురించి మాట్లాడారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను రేవంత్ రెడ్డి వివరిస్తూ.. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు కేంద్రంగా మారిందని, అన్ని రంగాలకు చెందిన అగ్రశ్రేణి కంపెనీలు తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా ఉండాలంటే మేధోవంతమైన వ్యవస్థలను నిర్మించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సదస్సులో స్మార్ట్ ఫ్యాక్టరీలు, స్థిరమైన ఇంధన వ్యవస్థలు, ఏఐ ఆధారిత సేవలు, స్మార్ట్ సిటీల నిర్మాణంపై ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ విధానాలపై చర్చించారు.

ఈ సమావేశంలో ఈజిప్ట్ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య మంత్రి హస్సన్ ఎల్కాహతీబ్, ఎమరాల్డ్ ఏఐ సీఈఓ వరుణ్ శివరామ్, ప్రపంచ మేధోసంపత్తి సంస్థ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జర్మనీ డిజిటల్ మంత్రిత్వ శాఖ మంత్రి కార్ స్టెన్ వైల్డ్ బెర్గర్, నోకియా సీఈఓ జస్టిన్ హోటార్డ్, హిటాచి సీఈఓ తోషియాకి టోకునాగా సహ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్

విశ్వంభర, నేషనల్ బ్యూరో : భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. 45 ఏళ్ల వయసులోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన అతి పిన్న వయస్కుడిగా ఆయన గుర్తింపు పొందారు. ఇది ఇలా ఉండగా బీజేపీకి నితిన్ నబీన్ 12వ జాతీయ అధ్యక్షుడు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీనైనా బీజేపీకి అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతలు స్వీకరించినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు. పార్టీని బలోపేతం చేయడంలో గత అధ్యక్షులు అందరూ చేసిన కృషికి తాను కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. నేను ఒక కార్యకర్తను. 'నితిన్ నబీన్ ఇప్పుడు నా బాస్' అంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఆయన కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్థానంలో ఈ బాధ్యతలు స్వీకరించారు.

కొత్త బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్ :

సీనియర్ బీజేపీ నేత నితిన్ నబీన్‌ను పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడిగా నియమించింది. ఈ నియామకం, ఈ ఏడాది జరగనున్న కీలక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ సంస్థాగత బలంపై, నాయకత్వం మార్పుపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. 45 ఏళ్ల వయసులోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎన్నికవ్వడం గమనార్హం. నితిన్ నబీన్‌కు వ్యతిరేకంగా ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయింది. దీంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎంపిక అయ్యారు. ఆయన అభ్యర్థిత్వానికి ప్రధాని నరేంద్ర మోదీ మద్దతు పలికారు.

అసలు ఎవరీ నితిన్ నబీన్ :

నితిన్ నబీన్ 1980లో జన్మించారు. ఇదే బీజేపీ స్థాపన సంవత్సరం కావడం గమనార్హం. ఆన బిహార్‌లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అలాగే గతంలో బిహార్ మంత్రివర్గంలో పలు శాఖలు నిర్వహించారు. ఇప్పటివరకూ బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న నితిన్ నబీన్ సిన్హా ఇప్పుడు జాతీయ అధ్యక్షుడిగా పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించారు. దివంగత సీనియర్ బీజేపీ నేత, నాలుగు సార్లు బీహార్ ఎమ్మెల్యేగా పని చేసిన నబిన్ కిషోర్ ప్రసాద్ సిన్హా కుమారుడే నితిన్ నబీన్. ఆయన తన తండ్రి మరణం తర్వాత 2006లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. పట్నా వెస్ట్ నియోజకవర్గం ఉప ఎన్నికలో విజయం సాధించినట్లు తెలుస్తోంది. నితీష్ కుమార్ నేతృత్వంలోని బిహార్ ప్రభుత్వంలో ఆయన రహదారుల నిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖల మంత్రిగా పని చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ పదవికి రాజీనామా చేశారు.

మూడేళ్ల పంటల శాటిలైట్ మ్యాపింగ్ డేటా అందించాలి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో వచ్చే ఖరీఫ్ నాటికి యూరియా యాప్‌ను అమల్లోకి తేనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్‌ను కేంద్ర ఫెర్టిలైజర్ శాఖ అభినందించిందని తెలిపారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, కోఆపరేషన్, హార్టికల్చర్ శాఖల పురోగతిపై ఆయా శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికి, మార్కెట్లో నకిలీ ఆర్గానిక్ లేబుల్లతో నకిలీ ఉత్పత్తులు చలామణీ అవుతున్నందున నిజమైన ఆర్గానిక్ పంటలు పండించే రైతులకు నష్టం చేకూరుతుందన్నారు. ఇందుకోసం వ్యవసాయశాఖ ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇచ్చే విధంగా ఒక యాప్ తీసుకురానుందని చెప్పారు. ఈ యాప్ ద్వారా కొనుగోలుదారు తాను కొనబోయే ఉత్పత్తి ఎక్కడ, ఏ రైతు, ఎలా పండించాడో తెలుసుకుంటాడని, అగ్రివర్సిటీలలోని ఖాళీ ప్రదేశాలలో ఆర్గానిక్ పంటలు పండించి, అక్కడే స్టాల్స్ పెట్టి అమ్మినట్లైతే రైతులు ఆర్గానిక్ పంట వైపు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

ఒక్క పైసా వృథాగా తిరిగి వెళ్లకూడదు..

రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఇప్పటికే రూ. 50 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ. 50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకే లభించేలా, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పట్టించుకోని కేంద్ర ప్రాయోజిత పథకాలను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి ఆదేశాలనుసారం ఒకొక్కటిగా పునరుద్ధరిస్తోందని, అందులో భాగంగా ఈ సంవత్సరం వివిధ పథకాల కింద ఇప్పటికే రూ.500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి పైసా పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని, కేంద్రం నుంచి వచ్చే ఒక్క పైసా కూడా వృథాగా తిరిగి వెళ్లకూడదని అధికారులకు సూచించారు. వచ్చే ఖరీఫ్ నాటికి పెద్దమొత్తంలో యూరియా బఫర్ స్టాక్ లను నిల్వలో ఉంచుకోవాలని, భవిష్యత్తులో యూరియా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైల్వే రేక్ పాయింట్లను కూడా ఎరువుల పంపిణీకి తగ్గట్లుగా ఉండేలా, మరికొన్ని రైల్వే రేక్ పాయింట్లను అదనంగా ఏర్పాటు చేసేవిధంగా రైల్వే అధికారులను కోరాలని సూచించారు.

శాటిలైట్ మ్యాపింగ్ డేటా అందించాలి..

అధికశాతం ఖచ్చితత్వంతో శాటిలైట్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ నెలాఖరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంటల శాటిలైట్ మ్యాపింగ్ డేటా రావాలని అధికారులను ఆదేశించారు. 3 సంవత్సరాల పంటల శాటిలైట్ మ్యాపింగ్ తో డేటా అందించాలని, డేటా ఫైనలైజ్ చేసేముందు ఒకసారి అధికారులతో ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖల డిపాజిట్లు ప్రైవేట్ కమర్షియల్ బ్యాంకులలో కాకుండా కోఆపరేటివ్ ,అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకులలో చేసేలా చూడాలన్నారు. అందుకోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లో కేంద్రం ఇచ్చిన లక్ష్యానికి రెట్టింపు ప్లాంటేషన్ జరిగేలా అధికారులు పనిచేయాలన్నారు. తక్కువ పురోగతి ఉన్న ఆయిల్ పామ్ కంపెనీలను రద్దు చేసి, వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు గాని, వేరే ఇతర కంపెనీలకు కేటాయించాలన్నారు. ఆయిల్ పామ్ కంపెనీలకు సంబంధించిన ఖాళీ ప్రదేశాల్లో మోడల్ పామ్ అభివృద్ధి చేసి, ఆయిల్ పామ్ రైతుల సందర్శనార్థం ఉంచితే, వారికి వచ్చే సందేహాలను నివృత్తి చేసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. పామ్ ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. దీంతో రైతులకు కూడా ఆయిల్ పామ్ పంట వేయాలనే కోరిక పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరాల కోసం కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, ఈ పరిస్థితి మారాలన్నారు.

డిమాండ్ కు తగ్గట్టుగా కూరగాయల సాగును ప్రోత్సహించాలని, కూరగాయల సాగులో విజయవంతం అయిన రైతులను రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఇతర రైతులతో మాట్లాడించాలి. గ్రామాలలోనే కాకుండా పట్టణాలలో కూడా అందుబాటులో ఉన్న స్థలాల్లో, టెర్రస్ ల మీద కూరగాయలు పండించేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులకోసం డిపార్ట్ మెంట్లలో, యూనివర్సిటీలు, కార్పోరేషన్లలో ఏర్పాటు చేసే ప్రతి కమిటీలలో అధికారులతో పాటు రైతుల ప్రాతినిధ్యం వహించేలా కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా కమిటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉండాలన్నారు. రైతు వేదికల దగ్గర సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని డిపార్ట్ మెంట్లకు సంబంధించి ఉన్న ఖాళీ ప్రదేశాలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, ఉత్పత్తి అయి మిగిలిన కరెంట్ ను గ్రిడ్ కు అమ్ముకొవచ్చన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా రెండు రైతువేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయగా, నెలకు 400 యూనిట్ల వరకు మిగులు కరెంటు ఉత్పత్తి అవుతుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, హార్టీకల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏడు గంటలు సొల్లు పురాణమే..

(మొదటి పేజీ తరువాయి)

విచారణ ఏమీ లేదు..

"ఏడు గంటల విచారణలో నన్ను అడిగిందే మీ లేదు. ఆధారాలు లేని మాటలు, అడిగిందే అడగడం, సొల్లు తప్ప ఇంకేమీ లేదు. ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా చూపలేదు. ఇదంతా కూడా ప్రజల దృష్టి మళ్లించడానికే. సైట్ విజిట్ పేరుతో జరిగిన కుంభకోణాన్ని బట్టబయలు చేశాం. రేవంత్ బామ్మర్ది బాగోతాన్ని బట్టబయలు చేయగానే సాయంత్రానికే నాకు సిట్ నోటసులు పంపారు. దీనిని నేను అవమానంగా భావించను. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య వాటాల పంపకం బయటకు వచ్చింది. దాని నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానిక సిట్టు, లట్టు, పొట్టు లాంటి నోటీసులు ఇచ్చారు. మేము చట్టాన్ని గౌరవిస్తాం కాబట్టి ఎన్నిసార్లు పిలిచినా విచారణకు వస్తాం" అని అన్నారు.

ఉద్యమాలు మాకు కొత్త కాదు..

ఈ సందర్భంగా హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమకు ఉద్యమాలు కొత్త కాదని, పారిపోయే రాజకీయాలు తమవి కాదని వ్యాఖ్యానించారు. సమైక్య రాష్ట్రంలోనూ ఎన్నో అక్రమ కేసులు ఎదుర్కొన్నామని, ఇప్పుడు ఇచ్చే నోటీసులను గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. "ఉదయం మీ బావమరిది బాగోతాన్ని బయటపెడితే, సాయంత్రం నాకు నోటీసులు ఇచ్చారు. ఇదే మీ పాలన తీరా?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు.రేవంత్‌రెడ్డికి నిజంగా ధైర్యం ఉంటే నోటీసులు ఇవ్వడం కాదని, రాజకీయంగా ఎదుర్కోవాలని సవాల్ విసిరారు. "నీ దోపిడీకి అడ్డు వస్తున్నామని చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి" అని హరీశ్‌రావు హెచ్చరించారు.

'విచారణ వీడియో మొత్తం బయటపెట్టాలి'.. తన విచారణపై ప్రభుత్వం మీడియాకు లీకులు ఇస్తుందని ఆరోపించిన హరీశ్‌రావు, ధైర్యం ఉంటే తాను ఎదుర్కొన్న ప్రశ్నలు-సమాధానాలన్నింటినీ వీడియో రూపంలో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. "చిల్లర లీకులు కాదు.. వీడియో మొత్తం విడుదల చేయాలి. ఈ నోటీసులు మమ్మల్ని కాదు, మీ పతనాన్ని వేగవంతం చేస్తాయి" అని మండిపడ్డారు. విచారణలో తాను ప్రశ్నలకు మాత్రమే సమాధానాలు ఇవ్వలేదని, అధికారులకే వందల ప్రశ్నలు వేసినట్లు చెప్పారు. అప్పటి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లతో పాటు శివధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిలను విచారణకు పిలవాలని తాను డిమాండ్ చేసినట్లు తెలిపారు. "ఫోన్ ట్యాపింగ్‌కు నాకేం సంబంధం? నేను హోం మంత్రిని కాదుకదా" అని వ్యాఖ్యానించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి..

సైట్ విజిట్ సర్టిఫికేట్ పేరుతో జరిగిన కుంభకోణాన్ని తామే బట్టబయలు చేశామని హరీశ్‌రావు తెలిపారు. చీటికి మాటికి సిట్‌లు వేస్తున్న ప్రభుత్వం, నిజాయతీ ఉంటే ఈ కుంభకోణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రుల మధ్య టెండర్ల వాటాల కోసం జరుగుతున్న పోటీ అంతా ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, ఈ కేసులో సుప్రీంకోర్టు కూడా తనకు క్లీన్ చిట్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ కక్షపూరితంగా తనపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

ప్రజాస్వామ్య విలువలకు సంరక్షకులుగా ఉన్నాం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నో నగరంలో జరిగిన 86వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో మంగళవారం ఆయన 'సమర్థతను పెంచడానికి మరియు ప్రజాస్వామ్య పాలనను బలోపేతం చేయడానికి శాసనసభ్యుల సామర్థ్య నిర్మాణం' అనే అంశంపై ప్రసంగించారు. పార్టీలకు అతీతంగా శాసనసభ స్పీకర్లు, శాసనమండలి చైర్మన్లు పని చేస్తున్నారని, ప్రజల అభ్యున్నతి కోసం చట్టాలను రూపొందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నైపుణ్యం, నైతికత మరియు దృక్పథంపైనే ప్రజాస్వామ్య పాలన ఆధారపడి ఉంటుందని, ప్రిసైడింగ్ అధికారులుగా తాము ప్రజాస్వామ్య విలువలకు సంరక్షకులుగా ఉన్నామని చెప్పారు. మన శాసనసభలు సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా, గౌరవంగా పనిచేసేలా చూడాల్సిన బాధ్యత తమపైనే ఉందన్నారు. శాసనసభ్యులు చట్టాల రూపకల్పన, ఆర్థిక పరిశీలన, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, నైతిక ప్రవర్తన మరియు ప్రభావవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను కలిగి ఉండాలని సూచించారు. తెలంగాణలో ఈ దిశగా అనేక చర్యలు తీసుకున్నామని, అనుభవం, నైపుణ్యం కలిగిన శాసనమండలి.. ఆలోచనాత్మక చర్చలు, విధానాల మెరుగుదలలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తెలంగాణలో నిర్వహిస్తున్న ఓరియంటేషన్ కార్యక్రమాలు, నిపుణులతో వర్క్‌షాప్‌లు మరియు ఎక్స్‌పోజర్ సందర్శనలు సభ్యుల పనితీరును మెరుగుపరచుకోవడానికి సహాయపడ్డాయని వివరించారు. ఈశాసనసభలు, పేపర్ లెస్ సెషన్లు, డిజిటల్ లైబ్రరీలు మరియు ఏఐ (AI) ఆధారిత పరిశోధన సహాయం సభ ఉత్పాదకతను బాగా పెంచుతాయని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో అనేక శాసనసభలు వర్చువల్ ప్లాట్‌ఫామ్‌లను విజయవంతంగా ఉపయోగించాయని, సాంకేతికతను తెలివిగా వాడినప్పుడు ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని ఈ అనుభవం నిరూపించిందని చెప్పారు. కమిటీ వ్యవస్థలను కూడా మరింత శక్తివంతం చేయాలని ఆయన కోరారు. డిజిటల్ మీడియా ప్రసారాలు బాధ్యతాయుతంగా ఉండాలని, తప్పుడు సమాచారం వల్ల మంచి కంటే చెడే త్వరగా వ్యాపిస్తుందని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హెచ్చరించారు. సామర్థ్య నిర్మాణం అనేది కేవలం శాసనసభ్యులకే పరిమితం కాదని, శాసనసభ సిబ్బంది మరియు సచివాలయ అధికారులు కూడా సభ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తారని గుత్తా సుఖేందర్ రెడ్డి వివరించారు.

మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎన్నికల ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (SEC) తన కసరత్తును ముమ్మరం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లాల వారీగా ఉన్న పరిస్థితులను అంచనా వేస్తూ, యంత్రాంగాన్ని అప్రమత్తం చేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగానే వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె వరుసగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ, ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులను తొలగించేందుకు ఎస్ఈసీ ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుంది. తాజాగా ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో రాణి కుముదిని సుదీర్ఘంగా చర్చించారు. ఆయా ప్రాంతాల్లోని మున్సిపాలిటీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితా స్థితిగతులు, పోలింగ్ కేంద్రాల మౌలిక వసతులపై ఆరా తీశారు. రేపు ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ సమావేశం కానున్నారు. ఈ జిల్లాల్లోని మున్సిపాలిటీల భౌగోళిక పరిస్థితులు, రాజకీయ సున్నితత్వం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించనున్నారు. మూడో రోజు ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లతో షెడ్యూల్ ఖరారైంది. దీంతో రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల సమీక్షా ప్రక్రియ పూర్తవుతుంది.

ఫోకస్ అంతా ఓటరు జాబితా పైనే..

ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఓటరు జాబితాల రూపకల్పనపై ఎస్ఈసీ గట్టిగా దృష్టి పెట్టింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, డూప్లికేట్ ఓట్లు లేకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. అలాగే, పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఓటర్లకు దూరం భారం లేకుండా చూడాలని, దివ్యాంగులకు అవసరమైన ర్యాంపుల ఏర్పాటుపై ప్రత్యేక నివేదికలు కోరారు.

ఎన్నికల కోడ్, శాంతిభద్రతలు..

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే అమలులోకి వచ్చే ఎన్నికల కోడ్ పై ముందస్తు అవగాహన కల్పించాలని రాణి కుముదిని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది గుర్తింపు, వారికి శిక్షణ ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ అదనపు బలగాల మోహరింపుపై పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పారదర్శక పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేందుకు 'పర్‌ఫెక్ట్ గైడ్‌లైన్స్' పాటించాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

ఇది 'సిట్' విచారణ కాదు.. 'పిచ్చి' విచారణ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. మాజీ మంత్రి హరీశ్ రావును సిట్ విచారణకు పిలవడంపై తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది నిష్పక్షపాతంగా జరుగుతున్న విచారణ కాదని, కేవలం రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం ఇలా చేస్తోందని ధ్వజమెత్తారు. "ఇది సిట్ విచారణ కాదు.. ఇదొక పిచ్చి విచారణ" అంటూ కేటీఆర్ అభివర్ణించారు. తమ పార్టీ నాయకులను వేధించడమే లక్ష్యంగా ఈ విచారణ సాగుతోందని ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి వేధించాలని చూస్తే.. న్యాయం కోసం హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

హామీలు నెరవేర్చలేకనే ఈ డ్రామాలు..

అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేక చేతులెత్తేసిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రజలు తమ సమస్యలపై నిలదీస్తుంటే, వారి దృష్టిని మళ్లించేందుకే పాత కేసులను తోడుతూ ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. కేవలం ఫోన్ ట్యాపింగ్ అంశమే కాకుండా, సింగరేణి టెండర్లలో జరుగుతున్న అవినీతిపై కేటీఆర్ బాంబు పేల్చారు. సింగరేణి టెండర్ల కుంభకోణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి అసలు సూత్రధారి అని కేటీఆర్ ఆరోపించారు. ఈ టెండర్ల వ్యవహారంలో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని.. దీనిపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ఊరుకోమని, ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగడుతూనే ఉంటామని కేటీఆర్ పునరుద్ఘాటించారు. రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసు వ్యవస్థను వాడుకోవడం తగదని ఆయన హితవు పలికారు.

రానున్న మూడేళ్లలో మున్సిపాలిటీని

మరింత అభివృద్ధి చేస్తా

విశ్వంభర, నేరేడుచర్ల : రానున్న మూడేళ్లలో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తా.. మహిళల జీవితాలలో ప్రత్యేకించి పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అందులో భాగంగానే వడ్డీలేని రుణాల పంపిణీ ఇస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ ఆవరణలో నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలోని 404 స్వయం సహాయక మహిళా సంఘాలకు 52, 07,399 రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. అంతేకాక ఇందిరా మహిళా శక్తి పథకం కింద 5498 మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. తాను ప్రజా జీవితంలో తపస్సులా ముందుకెళ్తున్నానని పేదల జీవితాలు బాగుపడేలా చేయడమే తన ధ్యేయమని అన్నారు.

2.5 కోట్లతో సిటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం..

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో వడ్డీలేని రుణాల పంపిణీతో పాటు 5498 మందికి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మిర్యాలగూడ నుండి నేరేడుచర్ల, కోదాడ మీదుగా ఖమ్మం జాతీయ రహదారి వరకు రహదారిని వేయించింది గతంలో

తానేనని గుర్తు చేశారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు హుజూర్ నగర్ లో 7.50 కోట్ల రూపాయలతో జూనియర్ కళాశాలను, 4.50 కోట్ల రూపాయలతో డిగ్రీ కళాశాల భవనాలు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని, హుజూర్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 2.5 కోట్లతో సిటీ స్కాన్, డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకుగాను హుజూర్నగర్ లో మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తే 40 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకొని 4500 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.

గత ప్రభుత్వం పేద ప్రజలకు దొడ్డు బియ్యం ఇచ్చేది..

ప్రజా ప్రభుత్వం రాకముందు గత ప్రభుత్వం పేద ప్రజలకు దొడ్డు బియ్యాన్ని ఇచ్చేదని అలాంటిది మేము అధికారంలోకి వచ్చాక సన్న బియ్యం ఇస్తున్నామని అంతేకాక అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కలెక్టర్ తేజస్ నందన్ లాల్ పవర్ జిల్లా ఎస్పీ కే నరసింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లం కొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ మండల అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి కొనతం చిన్న వెంకటరెడ్డి పాలకవీడు మాజీ ఎంపీపీ జడ్పీటీసీలు భుక్యా గోపాల్ మాలోత్ బుజ్జి మోతిలాల్ మెప్మా సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారత్-ఈయూ మధ్య 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'



విశ్వంభర, నేషనల్ బ్యూరో : భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య ఒక చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరే సమయం ఆసన్నమైందని యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ప్రకటించారు. మంగళవారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆమె ప్రసంగిస్తూ, ఈ ఒప్పందాన్ని కొందరు 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' (అన్నిటికీ మూలమైన అతిపెద్ద ఒప్పందం)గా అభివర్ణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా దాదాపు 200 కోట్ల మంది జనాభాతో కూడిన భారీ మార్కెట్ ఏర్పడుతుంది. ఇది ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి లో దాదాపు నాలుగో వంతు వాటాను కలిగి ఉంటుంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న భారతదేశం వంటి దేశాలతో వాణిజ్యం చేయడం వల్ల యూరప్‌కు 'ఫస్ట్‌మూవర్' (ప్రథమ అవకాశ) ప్రయోజనం లభిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత పర్యటన ఖరారు..

దావోస్ పర్యటన ముగిసిన వెంటనే తాను భారత్‌లో పర్యటించనున్నట్లు ఉర్సులా వాన్ డెర్ లేయన్ వెల్లడించారు. "ఇంకా కొంత పని బాకీ ఉంది, కానీ మేము ఒక చారిత్రాత్మక ఒప్పందానికి చేరువలో ఉన్నాం" అని ఆమె వ్యాఖ్యానించారు. ఈ శతాబ్దపు ఆర్థిక శక్తి కేంద్రాలతో వ్యాపార సంబంధాలను బలోపేతం చేసుకోవాలని యూరప్ ఆకాంక్షిస్తోందని ఆమె తెలిపారు. "లాటిన్ అమెరికా నుంచి ఇండోపసిఫిక్ ప్రాంతం వరకు.. యూరప్ ఎప్పుడూ ప్రపంచంతో మమేకమవ్వడానికే మొగ్గు చూపుతుంది. ప్రపంచం కూడా యూరప్‌తో చేతులు కలపడానికి సిద్ధంగా ఉంది" అని ఆమె స్పష్టం చేశారు.